నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | గురువారం 13 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# అలసత్వం వద్దు.. అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాల అర్బన్, మార్చి 12 : విధుల్లో ఆలసత్వం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండాలని రామగుండం కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. బుధవారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో జరిగే ప్రతి విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు. నేరాల నియంత్రణలో, ప్రాపర్టీ సంబంధిత నేరాల నియంత్రణలో బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ అధికారుల పాత్ర కీలకమన్నారు. డయల్ 100 కాల్ వచ్చినప్పుడు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ వర్టికల్స్ ఇన్‌చార్జ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

# గ్రూప్-2 ఫలితాల్లో సత్తా చాటిన తిరుపతి

మందమర్రి, మార్చి12 : రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో మందమర్రి పట్టణం ప్రాణహిత కాలనీకి చెందిన బొడ్డు తిరుపతి రాష్ట్రస్థాయిలో 77వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. సింగరేణి యాజమాన్యం నిర్వహించిన జేఎంఈటీ పరీక్షల్లో రెండో రెండో ర్యాంకు సాధించి తన ప్రయాణాన్ని మొదలుపెట్టారు. గత నవంబర్‌లో గ్రూప్-4 ఫలితాల్లోనూ ప్రతిభచాటి.. ప్రస్తుతం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రూప్-2లో ఉత్తీర్ణత సాధించడంపై తల్లిదండ్రులు బొడ్డు భూమయ్య-పోషక్క దంపతులు, బంధువులు, స్నేహితులు అతడిని అభినందిస్తున్నారు.



బొడ్డు తిరుపతి





పెంబిలో నీళ్లు లేక బీడుగా వ్యవసాయ భూమి

# బీడుగా భూములు

● భీమన్న చెరువుకు సరస్వతీ ఉప కాల్వ ద్వారా సరఫరా కాని సాగు నీరు ● నిధులు మంజూరైనా అనుమతి ఇవ్వని అటవీ శాఖ అధికారులు

పెంబి, మార్చి 12 : మండల కేంద్రంలోని భీమన్న చెరువుకు సరస్వతీ ఉప కాల్వ డీ-28 ద్వారా సాగు నీరు సరఫరా కావడం లేదు. దీంతో దీని ఆయకట్టు కింద దాదాపు 60 మంది రైతులకు చెందిన 120 ఎకరాలు బీడుగా మారాయి. డీ-28 కాల్వ మరమ్మతులు చేపట్టకపోవడంతో భీమన్న చెరువు వరకు నీరు రావడం లేదు. వర్షకాలంలో చెరువు నిండడంతో ఒక్క పంట మాత్రమే పండిస్తున్నామని, డీ-28 కాల్వకు మరమ్మతులు చేపట్టి యాసంగికి కూడా సాగు నీరు అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు విన్నవించిన పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. భూములు బీడుగా ఉండడంతో కూలీ పనులకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి డీ-28 కాల్వకు మరమ్మతులు చేపట్టి భీమన్న చెరువుకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ ఏఈ నవీన్‌ను వివరణ కోరగా.. మరమ్మతు కోసం నిధులు మంజురైనప్పటికీ అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాగు నీరు అందించడానికి కృషి చేస్తా.

నీరులేని సరస్వతీ ఉప కాల్వ డీ-28



## నీరు రాక.. కూలీకి పోతున్న..



నాకు భీమన్న చెరువు ఆయకట్టు కింద ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉంది. డీ-28 కాల్వ మరమ్మతుకు గురికావడంతో చెరువుకు సాగు నీరు రావడం లేదు. దీంతో యేటా యాసంగి సీజన్‌కు భూములు బీడుగా ఉంటున్నాయి. కాల్వకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులందరం కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు విన్నవించుకున్నాం. ఎవరు పట్టించుకోవడం లేదు. యాసంగి సాగు లేక కూలీ పనులకు వెళ్లాల్సి వస్తుంది. అధికారులు, నాయకులు డీ-28 కాల్వకు మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించేలా కృషి చేయండి.

**- చింతకింది రాజేందర్, రైతు, పెంబి.**

నీళ్లు లేక ఎండుతున్న జొన్న పంట



# అడుగంటిన ఆశలు

● బావులు, బోర్లలో కానరాని నీరు

● పొట్ట దశలో ఎండుతున్న జొన్న ● ఆందోళనలో రైతన్నలు

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/ లింగాపూర్, మార్చి 12 : జిల్లాలో ఈ యాసంగిలో వేసిన పంటలపై ఇక రైతాంగం ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండలు పెరిగి భూగర్భ జలాలు అడుగంటుతుండగా, చెరువులు, బోర్లపై ఆధారపడి వేసుకున్న పంటలు చేతికందకుండా పోయే దుస్థితి వచ్చింది. ఇక కొన్నిచోట్ల బోర్లు, బావుల్లో కొద్దిపాటి నీరున్నా కరెంట్ కోతల వల్ల ప్రయోజనం లేకుండా పోతున్నదని కర్షకలోకం కన్నీరు పెట్టుకుంటున్నది.

### 6050 ఎకరాల్లో జొన్న సాగు..

జిల్లాలో ఈ యాసంగిలో 6050 ఎకరాల్లో జొన్న సాగు చేశారు. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉంది. మార్చి నెలాఖరుకల్లా పంట కోత ప్రారంభమవుతుంది. ఈ సమయంలో నీళ్లు సరిపడా అందించాల్సి ఉంటుంది. కానీ భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు కరెంట్ కోతల వల్ల పంటలకు నీరందించుకోలేని పరిస్థితి వచ్చిందని రైతులు చెబుతున్నారు. వానకాలంలో సరైన దిగుబడి రాక నష్టాల్లో ఉన్న రైతులు ఈ యాసంగిలో కూడా మరింత నష్టం పోయే ప్రమాదమున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే శనగ 4 వేలు, మొక్కజొన్న 800 ఎకరాలు, గోధుమ వెయ్యి ఎకరాల్లో సాగు చేయగా, ఈ పంటలు కూడా చేతికందే పరిస్థితి లేకుండా పోయింది.



ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి జాదవ్ బాబు. ఈయనది కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని లింగాపూర్ మండల కేంద్రం. తనకున్న రెండెకరాల్లో జొన్న పంట వేశాడు. ఎండలు ముదరడంతో బావిలో నీళ్లు అడుగంటి పోయాయి. పొట్ట దశలో ఉన్న పంటకు నీరందించే పరిస్థితి లేకుండా పోయింది. కష్టనష్టాల కోర్చి పెట్టుబడులు తెచ్చి వేసిన పంట చేతికందకుండా పోయే దుస్థితి వచ్చింది. ఇగ ఇలాగైతే వ్యవసాయం ఎట్లా చేసుడు.. కుటుంబాన్ని ఎట్లా పోషించుడు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

# లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు అనుమతివ్వద్దు

బెల్లంపల్లి, మార్చి 12 : మందమర్రి ఏరియాలోని శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వద్దని రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం నిజామాబాద్‌లోని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజినల్ ఆఫీస్‌లో ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ లక్ష్మణ్ ప్రసాద్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. శాంతిఖని లాంగ్ వాల్ ప్రాజెక్టు ద్వారా ప్రభావిత గ్రామాల్లో జరుగుతున్న నష్టాలను ఆయనకు సమగ్రంగా వివరించారు. పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా ప్రాజెక్టును రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ప్రభావిత గ్రామాల రైతులు సింగతి సత్యనారాయణ,రామగౌని అశోక్ గౌడ్, సింగతి రవి, బాకం సుమన్, గోమాస వినోద్‌కుమార్, సదువుల వెంకటరమణ, బుక్య రాజు, బోయినపల్లి మధుకర్ ఉన్నారు.



ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

# తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి

**కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

కెరమెరి, మార్చి 12 : వేసవిలో తాగునీటికీ ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కెరమెరి మండలం ధనోరలోని డబ్ల్యూటీపీని సందర్శించి మిషన్ భగీరథ ఈఈ రాకేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రతీ గ్రామానికీ భగీరథ నీరందేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మిషన్ భగీరథ ఈఈ రాకేశ్ ఉన్నారు.

### 'పది' పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను అన్ని విధాలా సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం కెరమెరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.హెచ్‌ఎం ప్రకాశ్‌తో మాట్లాడారు. ప్రతి రోజూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు.



మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

బెల్లంపల్లి, మార్చి 12 : ప్రభుత్వ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని 100 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వార్డులు, మందుల నిల్వలు, రిజిష్టర్లు, ల్యాబ్‌ను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోగులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు కోసం ఆర్డీవో హరికృష్ణ, తహశీల్దార్ జ్యోత్స్న, డీఏవో కృష్ణతో కలిసి స్థలాలను పరిశీలించారు.



వంద పడకల దవాఖానలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

# విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి అరెస్టు

కన్నెపల్లి, మార్చి 12 : జగ్గయ్యపేటలోని ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు రేగుచెట్టు రమేశ్ ఓ పదేళ్ల విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించగా, పోలీసులు అరెస్టు చేశారు. ఉపాధ్యాయుడు మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించగా, ఆమె తన తల్లిదండ్రులకు తెలిపింది. వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బుధవారం ఉపాధ్యాయుడు రమేశ్‌ను అరెస్టు చేసి జుడీషియల్ రిమాండ్ కోసం బెల్లంపల్లి కోర్టులో హాజరు పర్చినట్లు భీమిని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

